నేడు సీనియర్ సిటిజన్స్‌కు బహుమతుల ప్రదానం

సనత్‌నగర్: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ ఆసరా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ ఉపాధ్యక్షుడు జీఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మోడల్‌కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

వారాసిగూడ ఇన్‌స్పెక్టర్‌కు ప్రశంసా పత్రం



ఇన్‌స్పెక్టర్ సైదులును అభినందిస్తున్న సీపీ సీవీ ఆనంద్

బౌద్ధనగర్: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ రాచకొండ సైదులును హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌కు ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతిని అందించారు. ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్సై సుధాకర్, మల్లికార్జున్, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ కాలేబు, కానిస్టేబుళ్లు వేణు, నాందేవ్, గణేష్‌లకు కూడా ప్రశంసా పత్రాలను, నగదు బహుమతులను అందించి అభినందించారు.

గద్దర్‌కు భారత రత్న ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత గద్దర్‌కు భారత రత్న అవార్డును ప్రకటించాలని బీసీ ఆజాద్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన గద్దర్ 77వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గద్దర్ గొప్ప కళాకారుడని తన ఆట పాటలతో కార్మికులు, పేదలు, పీడిత ప్రజల చైతన్య పరిచారని కొనియాడారు. పద్మశ్రీ అవార్డు విషయంలో గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాస్కర్, మధుసూదన్ రాజు, సాగర్, లక్ష్మణ్‌రావు, మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ పూజల్లో పాల్గొన్న మహిళలు

అడ్డగుట్ట: వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ ఆధ్వర్యంలో ఇంద్రలక్ష్మి నగర్‌లోని మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘానికి చెందిన పలు కుటుంబాలు పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వయోపరిమితి పెంపుపై ప్రొఫెసర్ల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయోపరిమితిని 60 నుంచి 65 సంవత్సరాలకు పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) అధ్యక్షులు ప్రొ. గడ్డం మల్లేశం మాట్లాడారు. యూజీసీ నిబంధనల ప్రకారం 65 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయస్సు ఉన్నప్పటికీ ఎన్ని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. టౌటా తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులను, అధికారులను సంప్రదించి వయోపరిమితి పెంచాలని అనేక సార్లు వినతి పత్రాలను అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌటా జనరల్ సెక్రెటరీ ప్రొ.సీహెచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డా.చలమల్ల వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎస్.నరసింహులు, ప్రొ. మంగు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 9,307 దరఖాస్తులు సమర్పించారు. అందులో ఇందిరమ్మ ఇండ్ల కోసం 7,100, పౌర సరఫరాల శాఖకు 1736 అర్జీలు వచ్చాయి. పంచాయ తీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 211, విద్యుత్ శాఖకు సంబంధించి 160, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి సం బంధించి ఒక దరఖాస్తు అందింది.

కొత్త సంతోషం కొందరికే..

సికింద్రాబాద్ నియోజకవర్గంలో రేషన్‌కార్డుల తొలి జాబితా సిద్ధం

- కొత్త రేషన్ కార్డులు 1497
- వేలమంది దరఖాస్తు దారుల్లో నిరాశ

సికింద్రాబాద్: పదేళ్ల నిరీక్షణ అనంతరం సికింద్రాబాద్ నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డుల జారీ కోసం రేషనింగ్ అధికారులు తొలి జాబితాకు తుది కసరత్తు చేస్తున్నారు. వేల సంఖ్యలోని దరఖాస్తుల్లోంచి పలు వడపోతల అనంతరం వందల సంఖ్యలో లబ్ధిదారులను అర్హులుగా ఎంపిక చేశారు. ఫిబ్రవరిలో కేవలం 1497 మందికి మాత్రమే కార్డులు అందించేందుకు పౌరసరఫరాల విభాగం అధికారులు తుది జాబితాను సిద్ధం చేశారు. దీంతో వేలాది మంది దరఖాస్తు దారులకు నిరాశ ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి.

పెండింగ్‌లో 11 వేల దరఖాస్తులు

సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి రేషన్ కార్డుల కోసం ఇప్పటిరకు 11 వేల పైచిలుకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు సికింద్రాబాద్ సహాయ పౌర సరఫరాల అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నేరుగా, మీ సేవా కేంద్రాల



ద్వారా 4,100 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల నుంచి 6,900 వేల దరఖాస్తులు వచ్చాయి.

పరిశీలనలో 3400

ప్రజాపాలనలో అందిన 6,900 వేల దరఖాస్తులను జతపరిచిన ధృవీకరణ పత్రాల ఆధారంగా పరిశీలనలు చేసిన అనంతరం ప్రాథమికంగా సర్వే కోసం జాబితాను రూపొందించారు. ఇందులోంచి 3449 దరఖాస్తుదారుల వాస్తవ పరిస్థితులను సేకరించేందుకు నిర్ణయించారు. జీహెచ్ఎంసీ, రేషనింగ్ విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, కార్ల తరహా వాహనాలు, 100 గజాలకు పైబడిన స్థలంలో సొంత ఇల్లు, వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు పైబడి ఉన్నవారి దరఖాస్తులను తిరస్కరించారు. పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి కరెంటుబిల్లుల ప్రాతిపదికన వివరాలను నమోదు చేసుకున్న సర్వే సిబ్బంది అర్హులను ఎంపిక చేశారు.

పారదర్శకంగా ఎంపిక

ఐదు డివిజన్లలో కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం పారదర్శకంగా సర్వే నిర్వహించి అర్హుల జాబితా ఎంపిక చేశామని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ, రేషనింగ్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఈనెల 16న సర్వే ప్రారంభించి వారం రోజుల పాటు కొనసాగించిన అనంతరం 3449 దరఖాస్తుల్లోంచి 1497 మందికి కొత్త కార్డులు జారీ చేసేందుకు తుది కసరత్తు చేస్తున్నారు. మొత్తంగా స్వంత ఇల్లు లేనివారికి తొలిప్రాధాన్యత ఇచ్చినట్టు, ఆ మీదట పక్కాగా 100 గజాల లోపు స్థలంలో గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణం మాత్రమే కలిగి ఉన్న గృహాలకు చెందిన కుటుంబాలను రేషన్ కార్డులు అందించడం కోసం పరిగణలోకి తీసుకున్నట్టు సమాచారం.

ఇదీ పరిస్థితి

బీఆర్ఎస్ హయాంలో	
దరఖాస్తులు	– 4,100
ప్రజాపాలనలో	– 6,900
మొత్తం	– 11,000
సర్వేకు ఎంపికైనవి	– 3400
తొలి జాబితాలో అర్హులు	– 1497

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి



డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్లూ) డిమాండ్ చేశాయి. శుక్రవారం రెండు సంఘాల ఆధ్వర్యంలో ప్యాట్నీ సెంటర్‌లోని డీఎంఅండ్ హెచ్‌వో కార్యాయం ముందు ఆందోళన నిర్వహించిన అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్, పీవోడబ్లూ నగర అధ్యక్షురాలు లక్ష్మి బాయి మాట్లాడుతూ.. గత రెండు నెలల నుంచి తమ సంస్థలు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సర్వే నిర్వహిస్తే విస్తుగొలిపే అంశాలు బయటపడ్డాయని వారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల రద్దీ అధికంగా ఉంటుందని కానీ డాక్టర్ల వద్ద క్యూ తప్పడం లేదని, మందుల కోసం ప్రైవేటు మెడికల్ షాపులకు రోగులు వెళుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బెడ్ల కొరత, కనీస వసతులు కరువవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు వరలక్ష్మి, రవికుమార్, కృష్ణ, కిరన్, భీమేష్, శ్రీనివాస్, పుష్ప పాల్గొన్నారు.

కార్ల డిజైనింగ్‌లో భద్రతకే ప్రాధాన్యం

సత్యం వెంచర్ ఇంజినీరింగ్ సీఈఓ



సట్వెన్ 25 ఏళ్ల సంబరాల్లో సీఈఓ రావు ఎస్.వల్లమూడి

సనత్‌నగర్: 25 ఏళ్లుగాభద్రతకు ప్రాధాన్యతనిస్తూ కార్ల డిజైనింగ్‌లో దేశం గర్వించదగ్గ స్థాయికి సట్వెన్ (సత్యం వెంచర్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్) ఎదిగిందని ఆ సంస్థ సీఈఓ రావు ఎస్.వల్లమూడి అన్నారు. బేగంపేటలోని సట్వెన్ 25 ఏళ్ల సంబరాలను శుక్రవారం వందలాది మంది ఉద్యోగుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సంస్థ గ్లోబల్ లీడర్‌గా ఎదగడం ఆనందంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా టాప్–8 కార్ల కంపెనీలకు డిజైనింగ్ టెక్నాలజీని సట్వెన్ ఎగుమతి చేస్తోందన్నారు. జర్మనీ, యూకే, జపాన్, చైనా, మెక్సికోలతో పాటు హైదరాబాద్, చెన్నై కేంద్రాలుగా సట్వెన్ సేవలను కొనసాగిస్తోందన్నారు. బీఎండబ్ల్యూ, నిస్సాన్, మజ్దా, మారుతి వంటి కంపెనీలకు డిజైనింగ్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రామన్‌చెర్ల, వెంకట్ గట్టినేని, మోహన్‌దేసు, సురేష్ సముద్రాల, కృష్ణకుమార్ తదిరతులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు



పదవీ విరమణ పొందిన ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

అడ్డగుట్ట: నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ గా విధులు నిర్వహించిన ఏవీ రెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ఏసీపీ జైపాల్‌రెడ్డి, లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబులు ముఖ్యఅతిథులుగా హాజరై సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఐ రమేష్‌గౌడ్, ఎస్ఐలు షాహీద్ పాషా, కిషోర్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్ఐ ఏవీ రెడ్డికి వీడ్కోలు పలుకుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

అమీర్‌పేట: పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ నర్సింగరావు, హెడ్ కానిస్టేబుల్ అజయ్ పదవీ విరమణ పొందారు. శుక్రవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను ఆప్యాయంగా పలకరించి సమస్యలను శ్రద్ధగా వినే వారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ గోపాల్, ఎస్సైలు శ్రావణ్,రాజు,అఖిల పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాటానికి మదతు

సనత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టే పోరాటానికి తన మద్దతు ఉంటుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రకటించారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ జేఏసీ నాయకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం నుంచి నిర్వహించే వేల గొంతుకలు–లక్ష డప్పులు కార్యక్రమానికి మద్దతు తెలపాలని కోరగా ఆయన తన మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జేఏసీ నాయకులు ఏసూరి మహేష్, కేఎం కృష్ణ, ఎస్ఆర్ మల్లేష్ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

బన్సీలాల్‌పేట్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ 77వ జయంతి వేడుకలను శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు రమేష్, డోలక్ విజయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ కె. హేమలత, ఎస్సీఆర్పీ అధ్యక్షులు డి.సుదర్శన్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..అణగారిన వర్గాల చైతన్యం కోసం ప్రజాగాయకుడిగా గద్దర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తన ఆటా పాటా ద్వారా సమాజంలో నవ చైతన్యం తీసువచ్చిన గొప్ప వాగ్గేయకారుడు గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అక్షయ్‌కుమార్, విజయ్‌పాల్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల అభివృద్ధి

ఎమ్మెల్యే తలసాని



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధి చేస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అమీర్‌పేట డివిజన్ కుమ్మరి బస్తీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. బస్తీలో తిరిగి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి అయ్యే వరకు బస్తీ వాసులు పనుల్ని పర్యవేక్షించాలని చెప్పారు. నాణ్యతతో సకాలంలో పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బల్కంపేట రేణుకానగర్ జనావాసాల నడుమ ఉన్న ఇండియన్ గ్యాస్ గోదాంను తరలించేలా చర్యలు పా్రరంభించాలని, దీనిపై ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్‌కు లేఖ రాసినట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు వెంకటేశ్వర్లు, వాసు దేవరెడ్డి, హరిశంకర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



సనత్‌నగర్: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శ్రీపబ్బా వీరాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, శేఖర్, జమీర్, నోమాన్, పురుషోత్తం, వసీం పాల్గొన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రబాబు, బొర్ర బిక్షపతి

బన్సీలాల్‌పేట్: ఎస్సీ ఉమ్మడి రిజరేషన్ల వర్గీకరణ అమలు కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలి రావాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి మాదిగ, డప్పు మల్లికార్జున్ మాదిగలు పిలుపునిచ్చారు. బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం మాదిగలు మారో సారి ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. ఈ నెల 7న నగరంలో జరగనున్న వేయిల గొంతులు, లక్షడప్పుల మహాప్రదర్శనకు పెద్ద ఎత్తున జనం తరలి రావాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మైనార్టీల సంక్షేమం

సనత్‌నగర్: ముస్లిం మైనార్టీల సంక్షేమం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే సాధ్యమవుతుందని రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజ్ అన్నారు. బేగంపేట పాటిగడ్డలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో పాటు వాగ్దానాలన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలుచేసుకుంటూ వెళ్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక మాట్లాడుతున్నాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారలోకి వచ్చిందంటే కార్యకర్తల కృషే కారణమన్నారు.

బోయిగూడ రైల్వే బ్రిడ్జి కింద ఇనుప రేకు తొలగింపు



నాడు



నేడు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడ ఫ్లోరా హోటల్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద ఐరన్ షీట్ ప్రమాదభరితంగా తయారైంది. నిత్యం వేలాది మంది వాహనచోదకులు, పాదచారులు ఈ బ్రిడ్జి కింది నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షి పత్రికలో 'ఊడితే మూడినట్టే' శీర్షికన వార్త ప్రచురితమైయింది. దీంతో రైల్వే అధికారులు స్పందించారు. బ్రిడ్జి కింద ప్రమాదకరంగా ఉన్న ఇనుప షీట్‌ను తొలగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం



మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు ప్రారంభిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా వైస్ ప్రసిడెంట్ పూనం సేవకు పేర్కొన్నారు. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల్లో సేఫ్ వాటర్ నెట్‌వర్క్, డ్యూపాయింట్ సంస్థ సంయుక్తంగా నిర్మించిన 23 మరుగు దొడ్లు మూత్ర శాలలను శుక్రవారం పూనం ప్రారంభించారు. నగరంలోని 73 ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని డ్యూపాయింట్ సంస్థ సహకారంతో వసతుల కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుప్రధ ఐరీన్, సేఫ్ వాటర్ నెట్వర్క్ ఇండియా ప్రతినిధులు శంకర్ లాల్ భద్ర పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

సనత్‌నగర్: విద్యపై పెట్టుబడితో గొప్ప మానవ వనరులను సృష్టించవచ్చని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలపై దృష్టి కేంద్రీకరించిందని, వాటి అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శుక్రవారం బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల వార్షిక వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచాన్ని ఏలే శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విద్యపై పెట్టుబడులు పెడుతున్నామన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని





విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

తెలిపారు. ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నామని, ఇప్పటికే 60 స్కూళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు.

స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు..

మహిళలను పారిశ్రామిక తీర్చిదిద్దాలన్న ఆలోచనలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. సహజంగా వీటిని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తారని, అందుకు భిన్నంగా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఇందిరమ్మ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు కేటాయిస్తుందని తెలిపారు. ఈ పథకం దేశంలోనే గొప్ప పథకంగా అభివర్ణించారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దబోతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్, ప్రిన్సిపాల్ ఉమా జోసఫ్ తదితరులు హాజరయ్యారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం

అమీర్‌పేట: ప్రేమ పేరుతో నమ్మించి మోసానికి పాల్పడ్డ యువకుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన యువతి (21) బేగంపేటలోని ఓ సంస్థలో పని చేస్తోంది. ఈమెకు వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన ముల్లా సాయితేజ (26) పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానంటూ వెంట పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేశాడు. ఆ తరువాత ఫోన్‌చేసినా స్పందించలేదు. ఈ క్రమంలో అతనికి మరో యువతితో నిశ్చయమైనట్లు యువతి తండ్రికి సాయితేజ తండ్రి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు నిందితుడిపై లైంగిక దాడి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

సతీష్ కుమార్‌కు అరుదైన గౌరవం



కంటోన్మెంట్: వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన కళానిధి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ వ్యవస్థాపకులు వరల్డ్ ఫాస్టెస్ట్ పియానో ప్లేయర్ డాక్టర్ సతీష్ కుమార్ వరల్డ్ హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించారు. శుక్రవారం గండిపేట్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు కోటి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకులు కోటి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక వేగంతో పియానో వాయించడం సాధారణ విషయం కాదన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞ శర్మ, వరల్డ్ రికార్డు డైరెక్టర్ సుమన్ పాల్గొన్నారు.